క్లుప్తంగా

ఉచిత ఇసుక విధానం అమలుపై హర్షం



పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో బుధవారం పొన్నూరు అంబేడ్కర్ సెంటర్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుండటంతో సామాన్యులు ఊపిరి పీల్చుకున్నారని.. ఇచ్చిన హామీని నెలరోజుల్లోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెల్లిందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఇసుక లారీలు, ట్రాక్టర్ల యజమానులు, భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని నులక పేటలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి.. అతని స్నేహితులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. సాయిరాధ ఫ్రెండ్స్ సర్కిల్ ఓల్డ్ వర్కర్స్ మాట్లాడుతూ తమ స్నేహితుడు షేక్ కాజా క్యాన్సర్‌తో బాధపడుతన్నాడని తెలుసుకుని రూ.1,00,500లు ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రాధా, జిలాని, గంగమావ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఫిరంగిపురం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రధాన మంత్రి మాతృత్వయోజన అభియాన్‌లో భాగంగా రెండో రోజు పలు గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారికి పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ప్రతి గర్భిణికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం, పాలు, రాగి పిండి, చిక్కి వంటి పదార్థాలతో పాటుగా క్యారెట్, బీట్రూట్, ఆకు కూరలు, కోడిగుడ్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి సర్వే నంబరు 24-1 ఇరిగేషన్ చెరువులో రాత్రిళ్లు అనుమతి లేకుండా గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని వీఆర్వో శివనాగరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు రాఘవేంద్రరావు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. స్పందించిన తహసీల్దారు ఇరిగేషన్ ఏఈకు సమాచారం ఇచ్చి, చెరువులలో మట్టి తవ్వకాలు జరపకుండా చూడాలని, ఆ ప్రాంతాల్లో కాపలా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

పార్టీ అండగా నిలుస్తుంది

ఫిరంగిపురం: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామ సర్పంచి డి.మెల్కియా ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో శేషగిరిరావును కలిశారు. పార్టీని గెలిపించుకోలేకపోవడంతో గ్రామంలో తాము పడుతున్న ఇబ్బందులు, సమస్యలు, పోలీసులు తీరు ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. స్పందించిన శేషగిరిరావు మాట్లాడుతూ విషయాలన్నింటిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, పార్టీ అండగా నిలుస్తుందని, సంయమనంతో ఉండాలని చెప్పారు.

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం జయంతి

తెనాలి: దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం జయంతిని బుధవారం స్థానిక అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ దళిత ఉద్యమనేత ఏసురత్నం, దేశ విదేశాల్లో దళితవాణిని వినిపించి, అనేక ప్రతిఘటన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాల కనుగుణంగా ప్రజలకు సేవచేయాలని కోరారు. ఏసురత్నం ఉద్యమస్ఫూర్తి, త్యాగనిరతి, పోరాట దీక్షలను దళిత నేతలు పిల్లి విద్యాసాగర్, వేము సమత, భీమిరెడ్డి శేషు, డాక్టర్ అబ్రహాం లింకన్, సేవాట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, దాస్, అందే శ్యామ్ వివరించారు. ఏసురత్నం మార్గంలో పయనించి దళిత విముక్తి మార్గంలో పనిచేయటమే కర్తవ్యమన్నారు.

అందని పాఠ్యపుస్తకాలు..
ప్రారంభం కాని పాఠాలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా పాఠశాలలు పునః ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టై వంటివి సకాలంలో విద్యార్థులకు అందించి వారి చదువులు నిరాటంకంగా కొనసాగేందుకు బాటలు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పూర్తి స్థాయిలో అందించటంలో విఫలమైంది.

- విద్యార్థులకు పూర్తి స్థాయి పుస్తకాలు పంపిణీ చేయటంలో ప్రభుత్వం విఫలం
- కొన్ని తరగతులలో ప్రారంభం కాని పాఠాలు
- ఈ నెల 30 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



పాఠశాలలకు తరలిస్తున్న పాఠ్య పుస్తకాలు (ఫైల్)

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా ఏటా విద్యాసంవత్సరం ఆరంభం కాక ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యునిఫాం వంటి వాటిని సమకూర్చి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యావ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచింది. ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం పాఠశాలలు పునః ప్రారంభమై నెల గడుస్తున్నా పూర్తి స్థాయిలో పుస్తకాలను పంపిణీ చేయలేక పోయింది. సకాలంలో పుస్తకాలు రాకపోవడంతో కొన్ని తరగతులలో కొన్ని సబ్జెక్టులకు పాఠాలు కూడా జరగడంలేదు. మరో పక్క ఎఫ్‌ఏ-1 పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఉపాధ్యాయులు ఏమీ చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

పొన్నూరు మండలంలో 88 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 5,587 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో బాలురు 2,631 మంది ఉండగా, బాలికలు 2,926 మంది ఉన్నారు. వీరికి ఏటా ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తోంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తారు. అయితే ప్రస్తుతం పాఠశాలలు తెరచి నెల రోజులైన అరకొర పుస్తకాలు మాత్రమే వచ్చాయి. పూర్తి స్థాయిలో పుస్తకాలు రాలేదు. ఈ నెల 30వ తేదీ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలను నిర్వహించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు కొన్ని పాఠశాలల్లో, కొన్ని తరగతులకు పాఠాలే ప్రారంభం కాలేదు. పరీక్షలను ఎలా నిర్వహించాలో.. పిల్లలు ఎలా పరీక్షలు రాస్తారోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు యూనిఫాం కూడా పూర్తిస్థాయిలో రాలేదు. గతంలో పాఠశాలల పునః ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం, షూలు, బెల్టు, టై వంటివి అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి.

90 శాతం పుస్తకాలు పంపిణీ

ఇప్పటి వరకు పాఠశాలలకు 90 శాతం పుస్తకాలను పంపిణీ చేశాం. అవసరమైన వారికి ఇప్పటికీ అందిస్తున్నాం. 6,7 తరగతులకు సంబంధించి కొన్ని పుస్తకాలు పూర్తి స్థాయిలో రాలేదు. రాని పుస్తకాలను పంపాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– శ్రీనివాసరెడ్డి , ఎంఈవో, పొన్నూరు

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిప్రతం అందజేస్తున్న కార్మికులు

పెదకాకాని : అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద అసంఘటిత కార్మికులు నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరపాలని, పంచాయతీ కార్మికులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచి, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజా రమేష్, రాజ్యలక్ష్మి, వరకుమారి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, ఉల్లందుల వెంకటరెడ్డి, కె.గోపి, యస్. బొల్లారెడ్డి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారుదల జరిగేలా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపం సమీపంలోని కాల్వల్లో బుధవారం జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వర్షపు నీరు కూడా రోడ్లపై ఉండకుండా మురుగు కాల్వల ద్వారా బయటకు పోయే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం ఆరో వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, డీఈ సుబ్బారావు, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మంచాలలో 'నేను బడికి పోతా' ర్యాలీ



మంచాలలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, అధికారులు

మంచాల(చేబ్రోలు): పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు..బడిలో అంటూ ఉపాధ్యాయులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో బుధవారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులతో గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను ఎంఈవోలు రాయల సుబ్బారావు, ఏవీహెచ్ ప్రసాద్‌లు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురు ఎంఈవోలు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి బడి బయట పిల్లలు లేని ఆదర్శ గ్రామంగా నిలపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు సమష్టి కృషి చేద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణ, కోఆర్డినేటర్లు, విద్యార్థులు

గుంటూరు రూరల్: డయేరియా నివారణకు సమష్టిగా కృషి చేసి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని మండల అభివృద్ధి అధికారి ఆదినారాయణరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డయేరియా నివారణకు కృషి చేద్దామని నినాదాలు చేశారు. జల్ జీవన్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, డయేరియాపై అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. డయేరియా చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ కో ఆర్డినేటర్లు సంగీత్, షఫీ, మండల కోఆర్డినేటర్ సురేష్, ఈఓ ఆంజనేయ ప్రసాద్, సర్పంచ్ లలిత కుమారి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మికి ఎస్ఎఫ్ఐ నేతల వినతి



డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మితో ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్.సమీర్, విద్యార్థినుల కన్వీనర్ సుచరిత డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య మున్సిపల్ స్కూల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే సమయంలో డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తనిఖీకి రావడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల సమస్యలను ఆమెతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు కొన్ని అందరికీ పూర్తి స్థాయిలో అందని పరిస్థితి ఉందన్నారు. ప్రధానంగా మురుగుదొడ్లు సక్రమంగా లేవని, ఉన్న మరుగు దొడ్లు కూడా పరిశుభ్రంగా లేవని తెలిపారు. విద్యార్థులకు బూట్లు, బెల్టులు, బ్యాగులు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. పాఠశాలల్లో ఎస్‌జీటీలను నియమించాలని కోరారు. అధిక హాజరు ఉన్న పాఠశాలల్లో ఆట స్థలాలు, వస్తువులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీరు శుభ్రంగా లేకపోవడం వల్ల విద్యార్థులు బయటకు వెళ్లి కొని నీరు తాగాల్సి పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మితో మాట్లాడి మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల యశ్వంత్, సిటీ విద్యార్థినుల కన్వీనర్ ఆరిఫా పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి మండలం గుడివాడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన తుమ్మల రవికుమార్(27)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. మనస్పర్థల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడంలేదు. మనస్తాపానికి గురైన భర్త బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

గ్రామీణ వైద్యుల సమస్యలపై లోకేష్‌కు వినతి

గుంటూరు మెడికల్: గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు మంత్రి నారా లోకేష్‌ను ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్ఎంపీలకు యువగళంలో ఇచ్చిన హామీని యూనియన్ నేతలు మంత్రి లోకేష్‌కు గుర్తు చేశారు. యువగళంలో మాట ఇచ్చిన ప్రకారం తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గ్రామీణ వైద్యుల సమస్యలపై నివేదిక అందజేయాలని మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు.

ఆర్టీసీ కండక్టర్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సుల రాకపోకల వివరాలు, డిపో పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఇన్‌స్టాగమ్ ద్వారా ప్రచారం చేస్తున్న కండక్టర్ పరుచూరి సుధాకర్‌ను బుధవారం డిపో ఆవరణలో సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి బస్టాండ్‌లో జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ ఆర్టీసీ పట్ల సదాభిప్రాయం కలిగే విధంగా కృషి చేస్తున్న సుధాకర్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా తాము కూడా ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా వీవీఐటీ జగన్నాథ రథయాత్ర



వీవీఐటీ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర



రథాన్ని బంగారు చీపురుతో శుభ్రపరిచి యాత్రను ప్రారంభిస్తున్న విద్యాసాగర్ దంపతులు

- పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం
- రథయాత్రను విజయవంతంగా నిర్వహించిన వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌కు పురస్కారం

పెదకాకాని : పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకొని వివా, వీవీఐటీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వీవీఐటీ జగన్నాథ రథయాత్ర పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి వీవీఐటీ కళాశాల వరకు డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, భక్త బృందాల కోలాటాల నడుమ బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ రథాన్ని వివా, వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణ ప్రియ దంపతులు బంగారు చీపురుతో (చెరాపహరా)తో శుభ్రపరచి రథయాత్రను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు, ఇస్కాన్ సభ్యులు, విదేశీ భక్తుల సంకీర్తనల నడుమ 'జై జగన్నాథ' నినాదాలతో యాత్ర శోభాయమానంగా సాగింది. ఇస్కాన్ సభ్యులు వీవీఐటీ కళాశాల వద్ద దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మహాహారతి ఇచ్చి విద్యార్థులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 6 కి.మీ. శ్రీ జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థలుగా వివా, వీవీఐటీలను గుర్తిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ వారు ఇండియన్ వరల్డ్ రికార్డు పురస్కారాన్ని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివా, వీవీఐటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ మంగళగిరి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమవరంలో పారిశుద్ధ్య చర్యలు

ఫిరంగిపురం: గ్రామంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి తెలిపారు.వేమవరం గ్రామంలో బుధవారం పారిశుద్ధ్యం, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యదర్శి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ తాగునీరు పారిశుద్ధ్య సమస్యలు గుర్తించి, వాటికి పరిష్కారం చూపి కొత్తగా వచ్చిన పీఆర్వో యాప్‌లో నమోదు చేస్తామని చెప్పారు.

సొరకాయకు ధరలేక రైతు దిగాలు



పండించిన సొరకాయలతో రైతు



మార్కెట్‌కు తరలిస్తున్న సొరకాయలు

- 30 కాయలున్న బస్తా రూ.100 నుంచి రూ.150లకు విక్రయాలు
- గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న సాగుదారులు

పొన్నూరు: ప్రస్తుతం కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కానీ సొరకాయ ధర మాత్రం తగ్గి, పండించిన రైతుకు నష్టాల బాట పట్టిస్తోంది. వ్యయ ప్రయాసలతో పండించిన సొరకాయ పంటకు మార్కెట్లో ధర లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కట్టెంపూడితో పాటు పలు గ్రామాలలో సొరకాయ పంట అధిక స్థాయిలో పండింది. పండించిన పంటకు ఆశించిన స్థాయిలో ధర ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. గత మే నెలలో పొలం వద్దనే ఒక్కో సొరకాయకు రూ.18 పలికిన ధర, ప్రస్తుతం రూ.3 నుంచి రూ.5 కు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 30 కాయలున్న బస్తా రూ.100 నుంచి రూ.150లకు గుంటూరు మార్కెట్‌లో విక్రయించాల్సి వస్తుందని, అవి కూడా వ్యాపారులు కొనుగోలు చేయకపోతే పారేయాల్సి వస్తుందని రైతులు ప్రదీప్, వాసు ఆవేదన వ్యక్తం చేశారు. పంట కోసే కూలీలకు ఒక్కొక్కరికి రూ.300 ఇవ్వాల్సి వస్తుందని, ఆటో బాడుగ కలిపితే పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లుతోందని వాపోయారు. పొలంలో ఎక్కువకాలం ఉంటే సొరకాయలు చెడిపోయే అవకాశాలు ఉండడంతో తక్కువ ధరకైనా విక్రయిస్తున్నామని చెబుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన



చేబ్రోలులో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



చేబ్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

చేబ్రోలు: కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను తక్షణమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం చేబ్రోలు సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన హామీలను అమలు చేయడానికి జీవోలు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, యానిమేటర్స్, స్కూల్ స్వీపర్స్, ఆర్పీలపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. స్కీం వర్కర్లందర్నీ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, రక్షణ పరికరాలు, నూనె , సబ్బులు, చెప్పులు తక్షణమే కార్మికులకు అందించాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రత్న మంజుల అధ్యక్షత వహించారు. ర్యాలీ ప్రదర్శన అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు రమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ వలి, హనుమంతరావు, పీ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నటుడు కమల్ హాసన్

నగరంపాలెం: కమల్ హాసన్ అంతర్జాతీయ నటుడని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. ఈ నెల 12న భారతీయుడు-2 చిత్రం విడుదల సందర్భంగా సురేష్ ఫిలింస్ ఆధ్వర్యంలో బుధవారం నాజ్ కూడలిలోని నాజ్ థియేటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అవసరమైన సందేశాత్మక సినిమాలు చేయడంలో నటుడు కమల్ హాసన్ తన విలక్షణత ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ వినూత్న సందేశాత్మక చిత్రం భారతీయుడు -2 అని అన్నారు. భారతీయుడు-2 చిత్ర విశేషాలను సురేష్ ఫిలింస్ జిల్లా మేనేజర్ మాదల రత్తయ్య చౌదరి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి శోభారాణి, నాజ్ థియేటర్ అధినేత లియాఖత్ అలీ, చిత్ర పంపిణీదారులు పాల్గొన్నారు.